క్లుప్తంగా

నేటి నుంచి షష్ఠి ఉత్సవాలు



రాజానగరంలో సుబ్రహ్మణ్యస్వామి

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున వెలసిన వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 98వ షష్ఠి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీవల్లీ, దేవసేన అనే ఇద్దరు దేవేరులతో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం మెట్ట ప్రాంతంలో ఇదొక్కటే కావడంతో భక్తులు భారీగా తరలివస్తారు. కానవరం, శ్రీకృష్ణపట్నం గ్రామాల్లోనూ షష్ఠి ఉత్సవాలు జరుగనున్నాయి. సంతానం లేని మహిళలు నాగుల చీరలు ధరించి, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణంలో ఉపవాస దీక్ష పాటిస్తారు. సాయంత్రం స్వామి వారి కల్యాణం అయిన తరువాత కల్యాణ తలంబ్రాలను చీర కొంగులతో పట్టుకుని, వాటితో పరమాన్నాన్ని తయారుచేసుకుని, ఉపవాస దీక్షను విరమిస్తారు. ఇలా చేయడం వల్ల సంతానం కలుగుతుందనే నమ్మకం ఉంది.

ముగిసిన ‘ట్రూత్ వివేకామృతం’ వేడుకలు



బలభద్రపురంలో ప్రసంగిస్తున్న ఆత్మ జ్ఞాన ప్రబోధకుడు వివేకానంద

బిక్కవోలు: మండలంలో వారం రోజులుగా బలభద్రపురం గ్రామంలోని ట్రూత్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, ఆత్మ జ్ఞాన ప్రబోధకుడు వివేకానంద ఆధ్వర్యంలో జరుగుతున్న ట్రూత్ వివేకామృతం విజయోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఆత్మజ్యోతికి ప్రతీకగా ఆకాశ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ, ఆధ్యాత్మికంగా సమాజంలో ఎలా మెలగాలి, పెద్దలతో వినయవిధేయతలు ఎలా కనబర్చాలనే వాటిని వివరించారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి



యూనియన్ రాష్ట్ర నాయకులకు స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

సీతానగరం: సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఆస్కారరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆస్కార రావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖలో ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఈనెల 14న రాజమహేంద్రవరం పుష్కరవనంలో జరిగే వన సమారాధనకు వైద్య సిబ్బందిని ఆహ్వానించారు.

నేడు టీచర్స్ పేరెంట్స్ మీటింగ్

మధురపూడి: కోరుకొండ మండలంలోని 55 స్కూళ్లలో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారులు కుశలవదొర, సుజాత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేరెంట్స్ కమిటీలను కోరారు.

పెదపూడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్–టీచర్స్ సదస్సులు జరుగుతాయని ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు. దీనికి విద్యార్థులు తల్లిదండ్రులు హాజరు కావాలని శుక్రవారం కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్న పాఠశాలల్లో వసతులు, విద్యాబోధనను మెరుగుపరిచేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

బైబిల్ నిత్యం పఠించాలి

మధురపూడి: క్రైస్తవులు నిత్యం బైబిల్ పఠనం చేయాలని ఆర్‌సీఎం ఫాదర్లు జార్జి, ఏసురాజు అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటివారికి ప్రేమతో, దయతో చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపదేశులు కొల్లి జాకబ్, రాయి థామస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ తెలిపారు. ఆ గ్రామ వేద పాఠశాలలో డొక్కా కామేశ్వరరావుకు ఇల్లు ఉంది. ఆయన ఆరోగ్యం బాగోకపోవడంతో రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతని భార్య వేద పాఠశాల విద్యార్థులకు తోడుగా ఉంటున్నారు. శుక్రవారం ఇంటికి వచ్చేసరికి తాళం పగలకొట్టి ఉంది. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.50 వేలు, రూ.4 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు, క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు.

ముందుకు సాగుతూ..

- మెట్టలో మొదలైన రబీ వరినాట్లు
- 350 ఎకరాలలో పూర్తి
- సాగులో రైతుల ముందడుగు



నరేంద్రపురంలో రబీ వరినాట్లు వేస్తున్న కూలీలు



వరినాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

రాజానగరం: జిల్లాలో ఖరీఫ్ వరి పంట కోతలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. కానీ మెట్ట ప్రాంత రైతులు మాత్రం రబీ సీజన్‌కి వరి నారుమడులు కట్టి, నాట్లు వేయడం కూడా ప్రారంభించేశారు. సీజన్ ఏదైనా వరి సాగులో అందరి కంటే ముందు ఉండడంతో పాటు చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా రక్షణ పొందుతున్నారు. ఖరీఫ్ కోతలు పూర్తయిన వెంటనే పొలాన్ని దుక్కి, రబీ సాగుకు సమాయత్తమైన ఇక్కడి రైతాంగం ప్రస్తుతం నాట్లు వేయడంలో బిజీగా ఉంది.

భూగర్భ జలాలే ఆధారం

మెట్ట ప్రాంతంలో సాగునీటి అవసరాలకు భూగర్భ జలాలే ఆధారం. ఈ ప్రాంతంలో విరివిగా ఉన్న గొట్టపు బావులు (బోర్లు) సాయంతోనే రైతులు ప్రతి సీజన్‌లోనూ వరి సాగులో ముందంజ వేస్తుంటారు. అందుకనే డిసెంబరు చివరి వారంలో గానీ ప్రారంభం కాని రబీ వరినాట్లు.. ఇక్కడ మాత్రం నవంబర్ చివరి వారంలోనే ప్రారంభ మయ్యాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సుమారు 350 ఎకరాలలో వరినాట్లు వేయగా, 250 ఎకరాలలో నాట్లు వేయడానికి సమాయత్త మవుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని మెట్ట ప్రాంతంలో డిసెంబరు చివరి వారం నాటికి పూర్తి స్థాయిలో రబీ నాట్లు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏపీఎస్ఐడీసీతో అంకురార్పణ

వర్షాలు, చెరువులలోని జలాలపైనే ఆధారపడి సేద్యం చేసే మెట్ట ప్రాంతంలో భూగర్భ జలాల వినియోగానికి గతంలో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐడీసీ) ద్వారా వేసిన బోర్లు అంకురార్పణ చేశాయి. దీనితో ఈ ప్రాంతంలో వరి పంట సాగుకు భూగర్భ జలాలతో ఉన్న అవకాశాలను వినియోగించుకోవడంలో రైతాంగానికి చైతన్యం వచ్చింది. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు కూడా వివిధ పథకాల ద్వారా సహాయ, సహకారాలు అందిస్తూ విరివిగా బోర్లు వేసుకునేందుకు తోడ్పడ్డాయి.

వైఎస్సార్ చలువతో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఉచిత విద్యుత్ పథకం.. గొట్టపు బావులను (బోర్లు) విస్తారంగా వేసుకునేలా చేసింది. ఈ క్రమంలో రైతులు చాలా ధైర్యంగా రబీ సీజన్‌లో కూడా వేల హెక్టార్లలో వరి పంటను పండిస్తున్నారు. అలాగే జిల్లాలో డెల్టా రైతుల కంటే ముందుగా వరిసాగు చేపడుతున్నారు. రాజానగరం మండలం నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, నందరాడ, వెలుగుబంద, రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు, తొర్రేడు, పక్కనే ఉన్న కాకినాడ జిల్లాలోని మురారి, గండేపల్లి, తదితర గ్రామాలలో రైతులు ప్రస్తుత రబీ వరి సాగుకు శ్రీకారం చుట్టారు.

రబీలో బోరు నీరే ఆధారం

మెట్ట ప్రాంతానికి సాగునీరుగా గోదావరి జలాలను అందించేందుకు చాగల్నాడు, పుష్కర ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. అయితే వాటి నుంచి వచ్చే నీరు ఎక్కువగా ఖరీఫ్‌కు సీజన్‌కే ఉపయోగపడుతుంది. దీంతో ఈ ప్రాంతంలో రబీ సీజన్‌లో బోరు నీటితోనే సాగు చేస్తారు. ఈ ప్రాంతంలోని 4,610 బోర్ల ద్వారా రబీ సీజన్‌లో 18,500 ఎకరాలలో వరిని సాగు చేస్తారని అంచనా.

నీటి ఎద్దడి ఉండదు



రబీ సీజన్‌లో వరినాట్లు అందరి కంటే ముందుగా వేయడానికి ప్రధాన కారణం బోరు నీరే. నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, వెలుగుబంద పరిసరాలలో ఎక్కువగా బోర్లు ఉండటంతో సాగు నీటికి పెద్దగా ఇబ్బంది ఉండదు. అంతే కాక తక్కువ కాల వ్యవధితో చేతికొచ్చే ఆర్ఎస్ఆర్ 15048 వరి వంగడాలను ఇక్కడ ఎక్కువగా సాగు చేస్తారు. ఈ రకాలకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. మంచి దిగుబడిని ఇస్తాయి.

– ఎర్ని అప్పారావు, రైతు, కలవచర్ల

మెట్ట ఎప్పుడూ ముందంజలోనే..



వరి సాగులో మెట్ట ప్రాంతం ఎప్పుడూ ముందంజలోనే ఉంటుంది. వర్షాలు విరివిగా కురిసే ఖరీఫ్ సీజన్ అయినా, ఎండలు మెండుగా ఉండే రబీ సీజన్ అయినా ఈ ప్రాంతంలో అధిక శాతం మంది రైతులు ఆధారపడేది బోర్ల పైనే. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఉచిత విద్యుత్ పథకం ఉందనే భరోసా కొంత వరకు రబీలో కూడా వరి సాగు చేయడానికి ఊపిరినిస్తోంది. సీజన్ ఏదైనా మెట్ట రైతులే వరి సాగులో జిల్లాలో అందరి కంటే ముందుంటున్నారు.

– ప్రగడ పుల్లయ్య, రైతు, నరేంద్రపురం

నిబంధనల మేరకు సర్వే చేయాలి



ఏపీత్రయంలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెదపూడి: సూక్ష్మ, చిన్నతరహా, మధ్యస్థ పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) సర్వేను సచివాలయం అధికారులు నిబంధనల ప్రకారం చేపట్టాలని సర్వే నోడల్ అధికారి, ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. ఆయన ఏపీత్రయంలో చేస్తున్న సర్వే ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సూక్ష్మ, చిన్నతరహా, మధ్యస్థ పరిశ్రమలు సుమారు 2,020 ఉన్నాయన్నారు. వీటిలో ఇప్పటి వరకు 155 పరిశ్రమల సర్వే పూర్తయిందన్నారు. హౌస్‌హోల్డ్ సర్వే 26,703 ఇళ్ల సర్వే చేయాల్సి ఉండగా, వాటిలో 26,510 చేశారని, 99 శాతం మేరకు పూర్తయిందని వివరించారు. అలాగే ఎస్‌పీసీఐ సర్వే 8,085 చేయాల్సి ఉండగా, వాటిలో 8,056 పూర్తి చేశారన్నారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ సర్వేలో సేకరించిన వివరాలను స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్‌లోని ఎంఎస్ఎంఈ విభాగంలో నమోదు చేయాలన్నారు. ఈ సర్వే వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటిలోపు పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేకు నోడల్ అధికారిగా మండలానికి తాను వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

8న చర్చి వార్షికోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరులోని గేట్ వే మినిస్ట్రీస్ చర్చి వార్షికోత్సవాన్ని ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నారు. గేట్ వే మినిస్ట్రీస్ అధినేత, పాస్టర్ వి.సూర్యచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ చర్చిని గత సంవత్సరం డిసెంబర్‌లో నిర్మించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు వాక్య సందేశాన్నిస్తారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



పందలపాకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు



కొమరిపాలెంలో 216 కలశాలతో కావడి ఉత్సవం ఊరేగింపు



కొమరిపాలెంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ నెల ఏడున షష్ఠి వేడుకల సందర్భంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు కొమాళ్లపల్లి మల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. విశేషంగా భక్తులు హాజరై, స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

కొమరిపాలెంలో పాల కావడి ఉత్సవం

మండలంలోని కొమరిపాలెం గ్రామంలో పవిత్ర తుల్యభాగ నది ఒడ్డున నెమలి ఆలయంలో కొలువై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీషణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని పాల కావడి ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ద్రవిడ విధానంలో పళని సంస్కృతి ప్రకారం షష్ఠి ముందు రోజు పాల కావడితో గ్రామోత్సవం చేశారు. దీనిలో భాగంగా 216 కలశాలతో గోదావరి జలాలను బిందెలతో తెచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, మురగన్ నృత్యాలు నిర్వహించారు. అనంతరం మురుగన్ మాలధారులు స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

వైభవంగా కల్యాణం

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల, సీతానగరం గ్రామాల్లోని ఆలయాలలో శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సీతానగరం శివాలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవంలో వలవల వల్లి, సుదర్శిని దంపతులు పాల్గొనగా, ఆలయ అర్చకుడు కొడమంచిలి రాంబాబు.. స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ముగ్గళ్ల శివాలయంలో దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో పాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులతో పాటుగా తొమ్మిది జంటలు పాల్గొన్నాయి. ఆలయ అర్చకులు కొడమంచిలి ఉమాస్వామి, విజయ్ కుమార్, వినేష్ కుమార్ కార్యక్రమం జరిపించారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ఆలయాల ముస్తాబు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవం శనివారం వైభవంగా జరగనుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయానికి రంగులేసి, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. షష్ఠి సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం జరిగే తీర్థ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతారు. బిక్కవోలు తరువాత అత్యంత పేరుగాంచిన రంగంపేట సుబ్రహ్మణ్య షష్ఠికి పేరుంది. ఈ సందర్భంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పోటీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మండలంలోని సుభద్రంపేట, దొంతమూరు గ్రామాలలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఘనంగా నిర్వహిస్తారు.

షష్ఠికి ప్రత్యేకాలంకరణ

బిక్కవోలు: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని వివిధ అలంకరణలతో తీర్చిదిద్దారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి.



రంగంపేటలో సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం



బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం

పెదపూడి: అనపర్తి మండలంలో శనివారం జరిగే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు గ్రామాల్లోని ఆలయాలు సిద్ధమయ్యాయి. అనపర్తిలో వీర్రాజు మామిడి వద్ద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం విద్యుత్ ఆలంకరణలో ముస్తాబు చేశారు. అలాగే రామవరం, అనపర్తి శివారు కొత్తూరు, కుతుకులూరు, కొప్పవరం, పులగుర్త, పెదపర్తి, పీరా రామచంద్రపురం, పొలమూరు, దుప్పలపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లోని షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.



రంగంపేటలో విశేష అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి



ఆలయ ముఖద్వారం వద్ద సెట్టింగ్



బిక్కవోలులో వేంకటేశ్వరస్వామి విద్యుద్దీపాలంకరణ



ఆకట్టుకుంటున్న విద్యుద్దీప కాంతులు

సామాజిక పోరాట యోధుడు అంబేడ్కర్

పెదపూడి: దేశంలో సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కొనియాడారు. వైఎస్సార్ సీపీ అనపర్తి కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పలువురు నేతలతో కలిసి డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ రూపకర్తగా, దేశంలో సామాజిక సమానత్వం కోసం పోరాటం చేసిన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఇలాంటి వ్యక్తి భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అనపర్తి మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, అనపర్తి టౌన్ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ కొండేటి భీమేష్, ఏడుకొండలు, సత్తి గంగిరెడ్డి, మండ శ్రీను, వీరయ్య కాపు, మల్లిడి సునీల్‌రెడ్డి, పానూరి కృష్ణ, ర్యాలీ కృష్ణ, రవి, బుల్లిరెడ్డి, పులగం శ్రీనివాసారెడ్డి పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

రంగంపేట: రాజ్యాంగ రూపకల్పనలో డా.అంబేడ్కర్ ఎనలేని సేవలు అందించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్ అన్నారు. శుక్రవారం వడిశలేరు ఎస్సీ కొత్తపేట కమ్యూనిటీ హాల్ వద్ద, పాత దళితపేటలో కుంతీదేవి గుడి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా, ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. పెదరాయవరంలోని ఎస్సీకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి చైతన్య యూత్ సభ్యులు నివాళులర్పించారు. సర్పంచ్ బరగటి సుజాత, బరగటి నాగేశ్వరరావు, బచ్చల గంగరాజు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



అనపర్తిలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

ఎస్సీల ఆశాజ్యోతి

పెదపూడి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రామవరం, అనపర్తి గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. శహపురం గ్రామంలో దళిత యువసేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. అంబేడ్కర్ విగ్రహంతో పాటు, మహాత్మా జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

రాజానగరం: అణగారిన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వడిశలేరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇజ్రాయేలు

- రాజానగరం మండలం సూర్యారావుపేటలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. హెచ్ఓడీ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ పీఓ కాశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: ఇనుగంటివారిపేట అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాడి రవికుమార్, బట్టు వెంకటరాజు, వందే రవితేజ (సన్నీ), చింతపల్లి సునీల్, గాడి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

మధురపూడి: బడుగుల జీవితాలలో వెలుగులు నింపిన అంబేడ్కర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం అందించిన మహనీయుడన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్, సూపరింటెండెంట్ శామ్యూల్ కుమార్, సచివాలయాల కార్యదర్శులు, మండల పరిషత్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కోరుకొండ మండలంలోని వివిధ గ్రామాల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



నన్నయలో అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు



రాజానగరంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ..



సీతానగరం మండలం ఇనుగంటివారిపేటలో..



కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉద్యోగులు